
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 30 జూన్ 2025




గలగలా గోదావరి..
- రేపు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత
- యేటా జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు ఎస్సారెస్పీలోకి విడుదల

7

- ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర హోంశాఖ
- సిబ్బంది జాబితా, గ్రామాల వారీగా మ్యాప్‌లు రెడీ
- ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులు
- త్వరలో విడతల వారీగా శిక్షణ

జన గణనకు సన్నాహాలు



జిల్లా వివరాలు..

మున్సిపాలిటీలు	5
రెవెన్యూ గ్రామాలు	287
రెవెన్యూ మండలాలు	20
గ్రామ పంచాయతీలు	383
భౌగోళిక విస్తీర్ణం చదరపు కిలోమీటర్లు	2,419
నివాస గృహాలు	2,54,608

జగిత్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల సర్వేకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. జనగణనకు సంబంధించి ఇటీవల కేంద్ర హోంశాఖ గెజిట్‌నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది. ఎన్యూ మరేటర్లు, సూపర్‌వైజర్లు, పర్యవేక్షణ అధికారుల నియామకం, సమ కూర్చుకోవాల్సిన సామాగ్రి తదితర అంశాలపై దృష్టి సారించింది. ఇప్పటికే సిబ్బంది నియామకం, గ్రామాల వారీగా మ్యాప్‌లు తదితర వాటిపై కసరత్తులు జరుగుతున్నాయి. సాధారణంగా ప్రతీ పదేళ్లకోసారి జనాభా లెక్కలు వెల్లడిస్తారు. చివరిసారి 2011లో జనగణన చేపట్టారు. నాటి లెక్కల ప్రకారం జిల్లా జనాభా 7,70,833 మంది ఉన్నారు. ఆ తరువాత 2021లో లెక్కించాల్సి ఉండగా కరోనా కారణంగా ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం జనగణన గెజిట్ విడుదల చేయడంలో జిల్లాలోనూ జనాభాను లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పేపర్ ద్వారా జనగణన చేపట్టగా ఈసారి డిజిటల్ మొబైల్ యాప్ ద్వారా సర్వే చేయనున్నారు.

● జిల్లా, మండల స్థాయిలో కమిటీలు

జనాభా లెక్కల సేకరణకు జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డీఆర్‌డీవో, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ మరికొందరు అధికారులతో జిల్లా కమిటీ ఉంటుంది. మండల స్థాయిలో తహహసీల్దార్, ఏఎస్‌వో (అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి)తో కమిటీ ఉంటుంది. తహసీల్దార్ జనాభా లెక్కల సేకరణ అధికారిగా, ఏఎస్‌వో సహాయ అధికారిగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమించనున్నారు. ఐదుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ఉంటారు. వీరికి జిల్లా పరిధిలోనే వివిధ స్థాయిల్లో శిక్షణ ఇస్తారు. ఉన్నత స్థాయి కమిటీలకు హైదరాబాద్‌లో శిక్షణ ఉంటుంది. ఈసారి డిజిటల్ మొబైల్ యాప్‌ను జనాభా లెక్కల సేకరణకు వినియోగించనున్నారు.

● రెండు విడతల్లో లెక్కింపు

రెండు విడతల్లో జనాభా లెక్కింపు చేయనున్నారు. మొదటి విడత 2025 అక్టోబరు 1, రెండో దశ 2027 మార్చి 1 నాటికి జనాభా లెక్కలు సేకరించనున్నారు. ఎన్యూమరేటర్లు ప్రతిఇంటికి రెండు దఫాలు వెళ్తారు. మొదటిసారి ఇళ్లను లెక్కించడంతో పాటు కుటుంబ స్థితిగతులు, ఆస్తులు, ఆదాయం, వసతులు వంటి అంశాలను సేకరిస్తారు. రెండో దశలో జనాభా వివరాలు సేకరించేందుకు ఇంటింటికీ వెళ్తారు. కుల, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమాచారం సేకరిస్తారు. ముఖ్య ప్రణాళిక, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు, ఎన్యూమరేటర్లు సేకరించి రూపొందించిన జాబితాల ఆధారంగా ప్రత్యేక కమిటీలు క్షేత్రస్థాయికి వెళ్లి నిర్ధారిస్తాయి. 2027 ఫిబ్రవరి మాసంలో ఇంటింటికి వెళ్లి జన గణన చేపట్టనున్నారు. ఫిబ్రవరి 28వ తేదీ అర్ధరాత్రి వరకు జన్మించిన వారి వివరాలనూ నమోదు చేస్తారు. మార్చి ఒకటో తేదీ నాటికి

- మిగతా 8లో

వైభవంగా జగన్నాథ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో ఆదివారం జగన్నాథ రథోత్సవం పెద్దాపూర్ శ్రీకృష్ణ దేవాలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని అతి పురాతన దేవాలయమైన శ్రీవేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహించి రథోత్సవం ప్రారంభించారు. పట్టణంలోని ఐబీ రోడ్డు నంది, కార్గిల్, అంబేడ్కర్, డైమండ్ చౌరస్తాల మీదుగా కాల్వగడ్డ నుండి వేంకటేశ్వర దేవాయం వరకు రథోత్సవం సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోరుట్ల సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో కోరుట్ల, కథలాపూర్ ఎస్‌ఐలు శ్రీకాంత్, రామచంద్రుడు, నవీన్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.

3న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో ఈనెల 3న బాస్కెట్‌బాల్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక ఉంటుందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు గద్వాల్ జిల్లాలో జూలై 11 నుంచి జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్ తీసుకుని రావాలన్నారు. 2007, జనవరి 1 తర్వాత పుట్టినవారు అర్హులని పేర్కొన్నారు.

అర్బన్ కాలనీలో నీటి కటకట

జగిత్యాల అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నూకపెల్లి అర్బన్ కాలనీ వాసులు కొన్ని రోజులుగా నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. కాలనీలోని రోడ్డు నంబర్‌లోని 15లో 12 రోజులుగా నీరు రావడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో నీటి సమస్య ఉన్న కారణంగా నీటిని పొదుపుగా వాడుకోవాలని కాలనీ అధ్యక్షుడు స్వామి సూచించారు.

దివ్యాంగుల ఉపకరణాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉచితంగా అందించే ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు జూలై 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భోనగిరి నరేష్ తెలిపారు. దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలు, వ్యాపార వాహనాలు, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్స్, వీల్‌చైర్‌లు, తదితర ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జూలై 5వరకు గడువు పెంచామని ఆయన తెలిపారు. అర్హులైనవారు టీజీఓబీఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



చెక్కును అందజేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ఎండపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఎండపల్లి మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ చేయడం సిగ్గు చేటని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఎవరూ చేయకూడని తప్పు చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేయడానికి కేటీఆర్ ఏమైనా పోలీస్ అధికారా లేక ఇన్వెస్టిగేషన్ అధికారా అని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ తప్పు చేయకుంటే విచారణకు హాజరై తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. బాధ్యత గల మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ చేయకూడదని తెలియదా అని అడ్లూరి ప్రశ్నించారు. మీడియాపై దాడి చేయించడానికి సిగ్గుండాలని మంత్రి అన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్తారని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్‌రెడ్డి, గుండాటి గోపిక జితెందర్‌రెడ్డి, ఎంపీడీవో, తహసీల్దార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
● డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్

జగిత్యాలరూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ బీసీ హాస్టల్‌లో ఆదివారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్‌లోని పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో చెత్త, చెదారం ఉన్న ప్రాంతాల్లో దోమల వ్యాప్తి అధికమవుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పేదల సొంతింటి కల సాకారం'

ఇబ్రహీంపట్నం, జూన్29 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని వేములకుర్తి గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమన్నారు. ప్రతి ఒక్క నిరుపేద సొంతింటి కలను సహకారం చేసుకునేలా ఈ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని అన్నినరు. ఇబ్రహీంపట్నం మండలానికి మొదటి విడతలోనే 466 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించామని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో కొన్ని గ్రామాల్లో కనీసం ఒక్క డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు కూడా మంజూరు చేయకుండా కాలయాపన చేశారని ఆయన ఎద్దేవా చేశారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వేములకొర్తి గ్రామ విడిసి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూదిగాం గంగాధర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్లదేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ అంకతి రాజన్న నాయకులు పెంట లింబాద్రి, నాంపల్లి వెంకటాద్రి, నాగేష్, మోర్తాటి గంగారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

పసుపు క్వింటాలుకు రూ.20 వేలు ప్రకటించాలి
-మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పసుపు క్వింటాలుకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేలు ప్రకటించాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉత్తర తెలంగాణ రైతుల ఉద్యమ ఫలితంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. అదేవిదంగా పసుపు మద్దథు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉత్తర తెలంగాణలో పసుపు సాగుకు అనుకూలమైన వాతావరణం ఉండడం వల్ల వేలాది మంది రైతులు పసుపు పంట సాగు చేస్తున్నప్పటికీ మద్దతు ధర కల్పించకపోవడంతో గిట్టుబాటు కావడం లేదన్నారు. గతంలో పసుపు సాగు చేసిన రైతుల ఇళ్లలో సిరులు కురిసేవని, క్వింటాలు పసుపు విక్రయిస్తే తులం బంగారం వచ్చేదన్నారు. బంగారం ధర ఆకాశానికి అంటుతూ తులానికి రూ. లక్షకు పెరిగి పోగా, పసపు ధర మాత్రం కేవలం రూ. 10 వేలకు పరిమితం కావడంతో రైతుల్లో నిరాశ, నిస్పృహలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పసుపు క్వింటాలుకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల మద్దతు ధర కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'రైతుమిత్ర' యథాతథం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్29 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వ హించే రైతు మిత్ర కార్యక్రమం సోమవారం యథాత థంగా నిర్వహించబడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. రైతులు పంటల్లో తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు తమకు దగ్గర్లో ఉన్న సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడీఏ ఆఫీస్ జగి త్యాల, మెట్‌పెల్లి, ధర్మపురి కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

కొడిమ్యాల, జూన్29(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నమిళొండ గ్రామానికి చెందిన చెలుమల్ల మహేందర్(38) రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మృతుడి భార్య మాధవికి ఆదివారం 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు మహిపాల్ రెడ్డి, కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ రాజనర్సింగరావు, కాంగ్రెస్ నాయకుడు శంకర్‌గౌడ్ ఉన్నారు.

●మల్యాల: మల్యాలకు చెందిన గసికంటి అజయ్, నూకపల్లికి చెందిన బీనవేని పెద్దన్న ఇటీవల మృతి చెందగా మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. నూకపల్లికి చెందిన కనకట్ల చందు భార్య హిమశ్రీ, నర్సయ్య, నులుగొండ భూమన్న, ముత్యంపేటకు చెందిన చెట్‌పల్లి నర్సయ్య మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి
● ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు



క్రీడలను ప్రారంభిస్తున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే ప్రతి విద్యార్థి క్రీడలపై దృష్టి సారించాలని ప్రైవేట్ పాఠశాలల సంఘం (ట్రస్మా) జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు అన్నారు. పట్టణంలోని స్థానిక మినీ స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సమాజంలో విద్యార్థులు టెక్నాలజీకి అలవాటు పడి, శారీరక ఆరోగ్యం పట్ల ఆసక్తి చూపకుండా సోషల్ మీడియాకు బానిసలుగా మారుతున్నారన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులకు పోటీతత్వం అలవడుతుందన్నారు. తల్లిదండ్రులు ఇప్పటికైనా తమ పిల్లలను క్రీడలపైన దృష్టిసారించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. క్రీడా పోటీల్లో 220మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, బ్రాడ్ జంప్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు నిర్వాహకుడు ముత్తయ్య రెడ్డి తెలిపారు. వీరిలో నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20మంది క్రీడాకారులను జూలై 6న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ సభ్యులు అంజయ్య, కొమురయ్య శంకర్, ప్రశాంత్ తో పాటు వివిధ పాఠశాలల క్రీడా ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏఐబీఎస్ మండల అధ్యక్షుడిగా చిరంజీవి నాయక్

రాయికల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఏఐబీఎస్ రాయికల్ మండల అధ్యక్షుడిగా గుగ్లావత్ చిరంజీవి నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు భూక్య గోవింద్ నాయక్ అన్నారు. రాయికల్ పట్టణంలోని శివాజీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా గుగ్లావత్ చిరంజీవి నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య శంకర్ నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రమేష్ నాయక్, భూక్య రాకేష్ నాయక్, మాలోతు తిరుపతి నాయక్, బానోతు రవి నాయక్, ప్రభాకర్, మాలోతు నరేందర్, అజ్మీర భూమా నాయక్, పరశురాం, శ్రీనివాస్, రాజేందర్, సురేష్, భూమా నాయక్, దశరథ్, బలరాం పాల్గొన్నారు.

నియామకం

కొడిమ్యాల, జూన్29 (ఆంధ్రజ్యోతి) : మండల ఎలక్ట్రీకల్, ప్లంబింగ్ యూనియన్ అధ్యక్షునిగా పీచర చరణ్‌రావును సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.డీ సలావుద్దీన్, ఉపాధ్యక్షులుగా డి.సత్తన్న, బత్తుల రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎండీ, షరీఫ్, సమాయ కార్యదర్శిగా కె. సాయితేజ, కోశాధికారిగా వి. కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా వి. విష్ణు, తిరుపతిరెడ్డి, సుమన్‌లను సభ్యులు ఎన్నుకున్నారు.

వైభవంగా బోనాల వేడుకలు



కోరుట్లలో బోనాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

జగిత్యాల క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వాణీనగర్ పద్మశాలి సేవాసంఘం, గోవిందుపల్లి, గౌతమినగర్ వాసులు, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని డీజే, డప్పు చప్పుల్లు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సతీమణి రాధిక, మాజీ జడ్పీ మున్సిపల్ చైర్‌పర్సన్‌లు దావ వసంత, అడువాల జ్యోతి తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం శివారులో ఉన్న పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు టీవి సత్యం, బండ శంకర్, రమణ, కొలగాని సత్యం తదితరులు ఉన్నారు.

●కోరుట్ల: పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులోని పెద్దమ్మ తల్లికి ఆదివారం మహిళలు బోనాలను సమర్పించారు. పట్టణంలోని వివిధ వార్డులలో ఉన్న ముదిరాజ్ సంఘ మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని శోభాయాత్రను నిర్వహించారు. ప్రత్యేక పూజలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. గంగమ్మ, పెద్దమ్మ, పోచమ్మ తల్లులకు మహిళలు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

●రాయికల్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర విశ్వబ్రాహ్మణ మనమయ సేవా సంఘం ఆధ్వర్యంలో పెద్దపోచమ్మ బోనాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గాజోజి మురళి, ప్రధాన కార్యదర్శి ఎనుగుర్తి శంకర్, కోశాధికారి గట్టుపల్లి నరేష్ కుమార్, ఉపాధ్యక్షులు సంకోజి అశోక్, పిప్పోజి మహేందర్ బాబు పాల్గొన్నారు.



జగిత్యాలలో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే సతీమణి రాధిక

చేపల వేటకు వెళ్లి ఇద్దరు మత్స్యకారులు మృతి


కనకయ్య(ఫైల్)

తిమ్మాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ మానేరు జలాశయంలో చేపలవేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు డ్యాంనీటిలో మునిగి మృతిచెందాడు. ఎల్ఎండీపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన పిల్లి కనకయ్య(61) శనివారం మధ్యాహ్నం దిగువమానేరు జలాశయంలో చేపల వేటకు వెళ్లాడు. డ్యాం మధ్యలో తెప్పపై నుంచి ప్రమాదవశాత్తు కనకయ్య నీటిలో పడి మునిగిపోయాడు. ఆదేరోజు సాయంత్రం కనకయ్య తీసుకువెళ్లిన తెప్ప డ్యాం ఒడ్డుకు చేరింది. ఇది గమనించిన మరోవ్యక్తి కనకయ్య తెప్ప ఓడ్డుకు వచ్చిందని, అతడు మాత్రం కనబడటం లేదని ఇంటికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో కనకయ్య కుటుంబ సభ్యులు రాత్రంతా డ్యాం చుట్టుపక్కల ఎక్కడా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం కనకయ్య మృతదేహం డ్యాం ఒడ్డుకు కొట్టుకొని వచ్చింది. గమనించిన స్థానికులు ఎల్ఎండీ పోలీసులకు, మృతుడి కుటుంబానికి సమాచారం అందించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నారు. కనకయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

గన్నేరువరం : చేపల వేటకు వెళ్లిన ఓ జాలరి గల్లంతైన ఘటన మండలంలోని మైలారంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గువ్వ రవి(45) అనే జాలరి ఆదివారం మధ్యాహ్నం చేపలవేటకు లోయర్ మానేరు డ్యాంకు వెళ్లాడు. తెప్పపై డ్యాంలోకి వెళ్లిన రవికి అకస్మాత్తుగా వీచిన గాలులు తీవ్రంగా తాకాయి. దీంతో తెప్ప తిరగబడింది. ఈ క్రమంలో రవి నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి మత్స్యకారులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతయిన రవికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కేసు

గంభీరావుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మానేరు జలాశయంలోకి పశువులను మేతకు తీసుకెళ్లిన వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటనలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల కేంద్రంలోని దోనికంటి గంగయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ ఆదివారం తెలిపారు. గంభీరావుపేట మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన జూపల్లి వెంకట్రావు తన పశువులను మానేరు జలాశయంలోకి మేత కోసం తీసుకెళ్లాడు. జలాశయంలో పశువులు నీళ్లు తాగుతున్న క్రమంలో అక్కడకు చేరుకున్న గంగయ్య ఇక్కడకు ఎందుకు తీసుకువస్తున్నావంటూ ఆగ్రహించడంతో పాటు అసభ్యపదజాలంతో దూషిస్తూ కర్రతో దాడికి దిగాడని చెప్పారు. బాధితుడి కొడుకు నవీన్‌రావు ఫిర్యాదు మేరకు గంగయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

పోటీ పడితే... పతకమే

- యోగాలో ప్రతిభ చూపుతున్న గ్రామీణ క్రీడాకారులు
- రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తా

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందుకు సాగితే ఏ రంగంలోనైనా విజయాలు వరిస్తాయి. జిల్లాలోని పలువురు క్రీడాకారులు యోగా క్రీడలో తమ సత్తాను చాటుతున్నారు. వివిధ గ్రామాలకు చెందిన వ్యవసాయ దినసరి కూలీల పిల్లలు అయిన వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతూ పతకాలను సాధిస్తున్నారు. జాతీయ యోగా పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు తిరుగులేని విజయాలను సొంతం చేసుకుంటున్నారు. శ్రమకు తగ్గ ఫలితాలను సాధిస్తున్నారు. వీరికి యోగా కోచ్ వావిలాల కిష్టయ్య శిక్షణ అందిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ పోటీలతోపాటు జిల్లా కేంద్రంలో జరిగిన పాఠశాలల క్రీడా సమాఖ్య యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రతిభచాటి ఉమ్మడి జిల్లాను ముందు వరుసలో నిలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలకు చెందిన కె సాయివర్షిని, బి హిందుప్రియ, జి శ్రీహర్ష దేశంలోని పలు ప్రాంతాల్లో జరిగిన జాతీయ పోటీల్లో, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు.

● 100 ఆసనాలు అలవోకగా...

చొప్పదండి మండల కేంద్రానికి చెందిన దినసరి కూలీలు వెంకటస్వామి, లలిత దంపతుల కూతురు కె సాయివర్షిని. క్రీడలపై ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఆమెను క్రీడా పాఠశాలలో ప్రవేశానికి పంపించారు. నాలుగో తరగతిలో ప్రవేశం పొందిన సాయివర్షిని అంచెలంచెలుగా ఎదుగుతూ వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతూ యోగా క్రీడలో రాణించాలనుకుంది. క్రీడా పాఠశాల యోగా కోచ్ కిష్టయ్య ఆమె ప్రతిభను గుర్తించి, యోగాలో శిక్షణ అందించారు. సాయివర్షిని ఇప్పటి వరకు పదిసార్లు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఎనిమిదిసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలను సాధించింది. కర్ణాటకలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్‌లో గత సంవత్సరం జరిగిన 43వ జాతీయ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంది. అంతర్జాతీయ స్థాయి యోగాలో పోటీల్లో బంగారు పతకం సాధించి, డాక్టర్ కావాలన్నదే తన లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. సాయివర్షిని, ప్రస్తుతం ఆమె వంద ఆసనాలను అలవోకగా వేస్తుంది.

● నాలుగో తరగతి నుంచే ఆసక్తి...

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం, ఘాట్‌పూర్ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు రామయ్య-లావణ్య కూతురు బి హిందూప్రియ. నాలుగో తరగతిలో క్రీడా పాఠశాలలో చేరిన హిందూప్రియ జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. 2023లో బెంగుళూరులో జరిగిన జాతీయ యోగా పోటీల్లో రజత పతకం సాధించింది. 2024లో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన జాతీయ యోగా పోటీల్లో కాంస్య పతకం సాధించింది.

● మొదటిసారే జాతీయ స్థాయికి...

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన నాగార్జున సాగర్-నవనీతల కుమారుడు జి శ్రీహర్ష. ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఆరుసార్లు పాల్గొని పతకాలను సాధించాడు. రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొని పతకాలను సాధించాడు. 2024 డిసెంబరులో దన్‌బాద్, జార్ఖండ్‌లో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించాడు.


యోగాసనం వేస్తున్న హిందు ప్రియ, సాయి వర్షిణి


యోగాసనం వేస్తున్న జి శ్రీహర్ష

విద్యార్థులకు మంచి శిక్షణ అందిస్తున్నాం..
- వావిలాల కిష్టయ్య, స్పోర్ట్స్ స్కూల్ యోగా కోచ్



విద్యార్థులకు మంచి శిక్షణ అందిస్తున్నాం. క్రీడా పాఠశాల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించారు. క్రీడా పాఠశాలలో విద్యను అభ్యసించిన అనేక మంది విద్యార్థులు ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడ్డారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం


అదృశ్యమైన లావణ్య, ఇద్దరు కుమారులు(ఫైల్)

కోనరావుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భర్త మహేష్‌తో గొడవపడి ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైనట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఊరడి మహేష్, భార్య లావణ్య ఇద్దరు గొడవపడ్డారు. ఈక్రమంలో భార్య లావణ్య, ఇద్దరు కుమారులు రాము, లక్ష్మణ్‌లతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా దొరకకపోవడంతో కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో భర్త మహేష్ ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మిస్సింగ్ అయినట్లుగా దర్యాప్తు చేపట్టారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలు పట్టివేత

తిమ్మాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పికప్ వాహనాన్ని, మానకొండూర్‌లోని లింగాపూర్ నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అలుగునూర్ గ్రామ శివారులో ఎల్ఎండీ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలను పోలీస్‌స్టేషన్ తరలించి వాహనాల డ్రైవర్లు, యజమానులైన దున్న పోతుల బాపు, గొర్రె అంజయ్య, దుదడ అరుణ్‌రెడ్డి, మాదాసు సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాలీ ఆటో బోల్తా


బోల్తా పడ్డ కోడిగుడ్ల ఆటో

వెల్గటూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం లోని కుమ్మరిపల్లిలో లేవెల్ బ్రిడ్జి వద్ద ఆదివారం కోడి గుడ్ల ట్రాలీ ఆటో బోల్తా పడింది. మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన మంచాల శ్రీనివాస్ ట్రాలీ ఆటోలో కోడి గుడ్లు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం గొల్లపల్లి మండలం గంగదేవిపల్లి నుంచి శాఖాపూర్ వస్తున్న క్రమంలో కుమ్మరి పల్లి లోలెవల్ వంతెనవద్ద బ్రేక్ పట్టుకోవ డంతో బోల్తా పడింది. ఈ సంఘటనలో ట్రాలీ ఆటోలో గల 400 ట్రేల కోడిగుడ్లు రోడ్డు మీద పడి పగిలిపోయాయి. వీటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. ఎవరికీ ప్రాణాపాయం సంభవించక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం


అపార్ట్‌మెంట్‌లో నుంచి వస్తున్న పొగలు

కోల్‌సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శ్రీనగర్ కాలనీలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో యాదగిరి అనే సింగరేణి కార్మికుడి ఫ్లాట్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి, పొగతో యాదగిరి, అతని భార్య రమాదేవి అస్వస్థత గురయ్యారు. వారిని సింగరేణిఏరియా హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలో ఉచ్చిడి భూపాల్‌రెడ్డి(64) అనేవ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని భూపాల్‌రెడ్డి కొంత కాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రతి రోజు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లేవాడు. ఆదివారం ఆయన పొలం వద్దకు వెళ్లకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ కూసంగి నవీన్ కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పరిధిపేటలో ఉంటున్న భూపాల్‌రెడ్డి కూతురు భోజయ్యగారి శ్వేతకు సమాచారం అందించాడు. దాంతో ఆమె తన తండ్రికి ఫోన్‌చేయగా స్పందించలేదు. ఆందోళనకు గురైన శ్వేత తనతండ్రి నివసిస్తున్న ఇంటి పక్కనఉన్న మంచాల బాలుకు విషయం చెప్పింది. ఆయన ఇంటికి వెళ్లి చూసేసరికి భూపాల్‌రెడ్డి అనుమానాస్పద స్థితిలో కిందపడి కనిపించాడు. చుట్టు పక్కల వారికి సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లి కింద పడిన భూపాల్‌రెడ్డిని పైకి లేపేందుకు ప్రయత్నించగా అదుపు తప్పి కింద పడిపోయాడు. అక్కడే ఉన్న నీటి డబ్బాలు తగిలి తీవ్రగాయాలైన వృద్ధుడు భూపాల్‌రెడ్డి చనిపోయాడు. ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. మృతురాలి కూతురు శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

నేడు సింగరేణి మెడికల్ కళాశాలకు తనిఖీ బృందం

కళ్యాణ్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌ను డీఎంఈ శివప్రసాద్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, మెంబర్ ఆఫ్ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ హిమబిందు, టీజీఎంఎస్ఐడీ విశ్వప్రసాద్ సోమవారం తనిఖీ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మెడికల్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో వీరు తనిఖీలు చేపట్టనున్నారు. మెడికల్ కళాశాలలో సరైన బోధన సిబ్బంది లేకపోవడం, అనుబంధంగా ఉన్న జనరల్ ఆసుపత్రిలో కార్డియో విభాగం, న్యూరో, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్లు విధుల్లోకి రాకపోవడం, చాలా మంది ప్రొఫెసర్లు ఇక్కడ పోస్టింగ్ అయినప్పటికీ డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. సిమ్స్ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్ల కొరత ఉండడం, ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర వ్యాప్తంగా 26 మెడికల్ కళాశాలల్లో సమస్యలు ఉన్నాయని గుర్తించడంతో ఈ నెల 18న ఆరోగ్యశాఖ కార్యదర్శి, డీఎంఈ, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్‌లు ఢిల్లీ వెళ్లి సమస్యలను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలల్లో ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం డీఎంఈ (అకాడమి) శివప్రసాద్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, రామగుండం, సిరిసిల్ల, జగిత్యాల మెడికల్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపనున్నారు.

ధర్మపురిలో భక్తుల ప్రత్యేక పూజలు


స్వామి వారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారికి ప్రీతి అయిన పట్టి నామాలు, కోరె మీసాలు భక్తులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తగు సేవలు అందించారు.

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా హరికృష్ణ యాదవ్


నియామకపత్రం తీసుకుంటున్న హరికృష్ణ

పెద్దపల్లిటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పెద్దపల్లి జిల్లా రామగుండంనకు చెందిన పి హరికృష్ణ యాదవ్‌ను జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, స్టూడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం నియామక పత్రం అందజేశారు. హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంఘం ఎదుగుదలకు, బీసీ విద్యార్థుల సమస్యలు, బీసీల హక్కుల కోసం పోరాడుతానన్నారు. తన నియామకానికి సహకరించిన ఆర్ కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, ఇతర బీసీ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి.. తీవ్ర గాయాలు

కోరుట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రవీంద్రరోడ్డులో ఆదివారం ఇట్యాల సత్యనారాయణ(49)పై అదే కాలనీకి చెందిన ఇల్లుటపు గంగనర్సయ్య కత్తితో దాడిచేశాడు. సత్యనారాయణను మొదట కోరుట్ల ప్రభుత్వఆసుపత్రికి తర లించి మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించినట్లు స్థానికులు తెలిపారు. కుల సంఘసమావేశంలో చోటుచేసుకున్న విబే దాలతో పాటు గంగనర్సయ్య పాత కక్షలు మనసులో పెట్టుకొని సత్యనారాయణపై దాడిచేసినట్లుగా తెలిసింది. ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా గంగనర్సయ్య పోలీసులకు లొంగిపోయినట్లుగా తెలుస్తోంది.

బాలుడిని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

వెల్గటూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిపల్లి గ్రామంలో ఆర్టీసీ బస్సు ఆదివారం అనిరుద్(12) అనే బాలుడిని ఢీకొనడంతో గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం కరీంనగర్ నుంచి గొడిసెల పేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు పైడిపల్లిలో అనిరుద్‌ను ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. కుటుంబీకులు బాలుడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చందుర్తి జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామంలో ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల వెంకటి (70) అనే వృద్ధుడు తన ఇంటి ముందు వాకిట్లో ఉండగా, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పూడూరి భరత్ అనే యువకుడు ద్విచక్ర వాహనంతో బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ వెంకటిని చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సత్తవ్వ, ఇద్దరు కుమారులు కూతురు ఉన్నారు. ఈ సంఘటనపై మృతుడి కోడలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

వేములవాడరూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరివేసుకుని ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మర్రిపల్లి గ్రామానికి చెందిన పండుగ బక్కవ్వ (65) అనారోగ్య సమస్యలు, మానసిక పరిస్థితి సరిగాలేక ఇంటి ఆవరణలోని చెట్టుకు ఉరివేసుకుని ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త నర్సయ్య కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

వేములవాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్థికఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన నాగుల వేణు(45) గతంలో గల్ఫ్ వెళ్లి వచ్చి ప్రస్తుతం గ్రామంలో కూలీ పని చేసుకుంటున్నాడు. కుటుంబ పోషణకు చేసిన అప్పుల భారం, ఆర్థికఇబ్బందులు ఎక్కువై మనస్థాపానికి గురయ్యాడు.

శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ పట్టణసీఐ వీరప్రసాద్ తెలిపారు.

కేజ్‌వీల్స్‌తో నడిపితే కేసే..


కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై నుంచి వెళ్తున్న ట్రాక్టర్

కరీంనగర్ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. రైతులు ఇప్పటికే నారు మడులు సిద్ధం చేసుకున్నారు. కొందరు నాట్లు వేసేందుకు సమయత్తమయ్యారు. వరి పంట సాగు కోసం రైతులు కేజ్‌విల్ ట్రాక్టర్లను వినియోగిస్తారు. నారు మడి దున్నిన నుంచి నాట్లు వేసే వరకు ట్రాక్టర్‌తో పొలాన్ని కలియదున్నుతారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ట్రాక్టర్లను కేజ్‌వీల్స్‌తో తీసుకుపోతుంటారు. ఈ సందర్భంలో రోడ్లపై నుంచి వెళ్లడం వల్ల రహదారులు ధ్వంసం అవుతాయి. తారురోడ్డుపై కేజ్‌వీల్స్‌తో వెళ్లడంతో రోడ్డుపై గీతలు పడి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతాయి. కేజ్‌వీల్స్‌తో రోడ్లపై వెళితే పోలీసులు కేసులు నమోదు చేస్తారు. కరీంనగర్ రూరల్ మండలంలో ఈ సీజన్‌లో 13వేల ఎకరాలకు పైగా వరి సాగు చేస్తారని అంచనా వేశారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు వేల సంఖ్యలో ఉన్నాయి. అవన్నీ తిరిగితే రోడ్లు ధ్వసమయ్యే అవకాశం ఉంది. పోలీసులు, రవాణా శాఖ అధికారులు ట్రాక్టర్ల యజమానులకు అవగాహన కల్పించినా పట్టించుకోవడం లేదు. కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్లలో తీసుకెళ్లి పొలం వద్ద వాటిని బిగించుకోవాలి. పని పూర్తయ్యాక అక్కడే మార్చేసి ఇంటికి అదే తరహాలో తీసుకురావాలి. కేజ్‌వీల్స్‌ను కవర్ చేయడానికి మెటల్ స్ట్రిప్ లేదంటే సేఫ్టీ రింగ్ వినియోగించాలి. కేజ్‌వీల్స్‌తో రోడ్లపై నడిపితే పబ్లిక్ డ్యామేజ్ యాక్ట్ ప్రకారం ట్రాక్టర్‌ను సీజ్ చేస్తారు. డ్రైవర్ పై కేసు నమోదు చేస్తారు.

సదరం ఉన్నా.. రాని పింఛన్

- ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దివ్యాంగులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



దివ్యాంగులు నిజానం రాజయ్య, దర్శనం తులసి

చిగురుమామిడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలు ఉండి, ప్రభుత్వం నిర్వహించిన సదరం క్యాంపులో సర్టిఫికెట్ పొందిన తమకు పింఛన్ రావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాలుగా పింఛన్ కోసం ప్రభుత్వకార్యాలయాల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా పట్టించుకునే నాథుడు లేడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుందరగిరి గ్రామానికిచెందిన నిజానం రాజయ్య రెండు కాళ్లను వివిధ కారణల వల్ల తొలగించారు. అనంతరం వైద్యులు అతడికి సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. కానీ పింఛన్ రావడం లేదు. ఇదే మండలంలోని రామంచ గ్రామానికి చెందిన దర్శనం తులసి అనేబాలిక మానసిక వికలాంగురాలు. ఆమెకు 2019లో మానసిక వికలాంగురాలుగా సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. పింఛన్‌కోసం అప్లై చేసుకుని సంవత్సరాలు గడుస్తున్నా రావడం లేదని ఆమె తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది.

రోజువారి కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే తాము కూతురుకి వైద్యం చేయించలేక ఇబ్బందులు పడుతున్నామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకుపోయినప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడని అన్నారు.

● పింఛన్ వస్తుందనే నమ్మకం లేదు..
- నిజానం రాజయ్య, సుందరగిరి

నేను బతికుండగా పింఛన్ వస్తుందనే నమ్మకం లేదు. నాకు ఎలాంటి ఆస్తులు లేవు. కడు పేద కుటుంబానికి చెందిన వాడిని. కాళ్లు లేకున్నా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నా. తన గోడును పట్టించున్న నాథుడు లేడు.

● కూతురు పింఛన్ కోసం ఆరేళ్లుగా తిరుగుతున్నా..
- దర్శనం రాజేశ్వరి(తులసి తల్లి), రామంచ

మాకు ఎలాంటి అస్తులు లేవు. మష్టిన్ కులానికి చెందిన వాళ్లం. యాచక వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నాం. కూతరు పింఛన్ కోసం ఆరేళ్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదు. ఇకనైనా నా కూతురుకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.

నేడు ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

భీమదేవరపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార బ్యాంకు ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి హవా కొనసాగుతోంది. 1987 నుంచి ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడిగా తన పాలకవర్గాన్ని గెలిపించుకోవడంలో ప్రవీణ్‌రెడ్డి తిరుగులేని నాయకుడిగా కొనసాగుతున్నారు. దాదాపుగా రూ. 400కోట్ల ఆర్థిక లావాదేవీలతో ముల్కనూర్ సహకార బ్యాంకు కొనసాగుతుంది. 1987 నుంచి నేటి వరకు జరిగిన ప్రతి ఎన్నికల్లో బ్యాంకు అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తూ వస్తున్నారు. ప్రవీణ్‌రెడ్డి ప్యానల్ డైరెక్టర్లను రైతులు మద్దతు ఇస్తూ గెలిపిస్తున్నారు. ముల్కనూర్ బ్యాంకులో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్,సీపీఐ, టీడీపీ తదితరపార్టీలకు చెందిన రైతునాయకులు ప్రవీణ్‌రెడ్డికి వెన్నుదండుగా నిలుస్తున్నారు. సోమవారం జరిగే బ్యాంకు అధ్యక్షఎన్నికల్లో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం రైతులు పెద్ద ఎత్తున్న బ్యాంకుకు తరలిరానున్నారు.

దోస్త్ మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి

గణేశ్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో దోస్త్ మూడోవిడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. మూడోవిడతలో సీట్లు పొందిన విద్యార్థులు జూలై ఒకటో తేదీలోగా సీట్ రిజర్వ్ చేసుకోవాలని, లేనిపక్షంలో రిజిస్ట్రేషన్ రద్దు అవుతుందని దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 36,060సీట్లకు మొదటి, రెండో విడతలో 9455సీట్లను కేటాయించగా 6730 మందివిద్యార్థులు అడ్మిషన్ ఖరారు చేసుకున్నారు. 29,330సీట్లు ఖాళీగా ఉండగా మూడోవిడతలో 7629సీట్లలో 13 ప్రభుత్వ కళాశాలల్లో 1060 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. మూడు ప్రభుత్వ అటానమస్ డిగ్రీకళాశాలల్లో 1046 మందికి, 60ప్రైవేటు కళాశాలల్లో 5523మంది విద్యార్థులకు సీట్లుకేటాయించినట్లు వివరించారు.

గలగలా గోదావరి



- రేపు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత
- యేటా జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు ఎస్సారెస్పీలోకి విడుదల

జగిత్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను జూలై1న ఎత్తనున్నారు. బాబ్లీ ప్రాజెక్టు నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ)కి నీటి విడుదల ఒక వివాదంతో మొదలైంది. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలుకా బాబ్లీ గ్రామం దగ్గర గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టును మొత్తం 14 గేట్లతో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 80 కిలోమీటర్ల ఎగువన ఉన్న ధర్మాబాద్ సమీపంలో మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టును నిర్మించింది. దీనివల్ల ఎస్సారెస్పీకి నీటి రాక తగ్గుతుందని తెలంగాణ ప్రభుత్వం ఆందోళన చెందింది. ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది.

శ్రీరాంసాగర్ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో ఇలా..(టీఎంసీలలో)

సంవత్సరం	ఇన్‌ఫ్లో	అవుట్ ఫ్లో
2020-21	371.913	382.847
2021-22	678.159	676.645
2022-23	591.061	594.150
2023-24	208.949	220.015
2024-25	293.384	287.985

● అత్యున్నత న్యాయస్థానం తీర్పు మేరకు..

బాబ్లీ విషయంలో 2013 సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ప్రతీ సంవత్సరం జూలై 1వ తేదీ నుంచి అక్టోబరు 28వ తేదీ వరకు అదేవిధంగా తాగునీటి కోసం మార్చి1న దిగువన ఉన్న ప్రాంతాలకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయాలని ఆదేశించింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే ఎస్సారెస్పీకి అడ్డులేకుండా అక్టోబర్ 28వ తేదీ వరకు బాబ్లీ గేట్లను తెరిచి ఉంచాల్సి ఉంటుంది. బాబ్లీ ప్రాజెక్టు నీటి విడుదలను మహారాష్ట్ర, తెలంగాణ నీటి పారుదల అధికారులతో పాటు సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారులు కూడా పర్యవేక్షిస్తారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో పాటు దిగువన ఉన్న గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించాలన్న ఉద్దేశ్యంతో బాబ్లీ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తున్నారు.

● ఎస్సారెస్పీ ఎగువన ప్రాజెక్టులు ఇలా..

ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతంలో మహారాష్ట్రలో బాబ్లీ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 2.75 టీఎంసీ లుగా ఉంది. దీంతో పాటు నాందేడ్ జిల్లాలో విష్ణుపురి ప్రాజెక్టు 2.85 టీఎంసీల సామర్థ్యం, బాలేగావ్ ప్రాజెక్టు 1.5 టీఎం సీల సామర్థ్యంతో నిర్మించబడి ఉన్నాయి. ఎస్సారెస్పీకి ఎగు వన సుమారు 350 కిలోమీటర్ల దూరంలో జైక్వాడ్ ప్రాజెక్టు 102.68 టీఎంసీల సామర్థ్యంతో భారీ ప్రాజెక్టు ఉంది. అయితే ప్రతీ యేటా మార్చి 1వ తేదీన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 0.6 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీలోకి వదులుతారు. 0.6 టీఎంసీల నీటిని గోదావరిలోకి విడుదల చేయగానే బాబ్లీ గేట్ల మూసివేత ప్రక్రియను ప్రారంభిస్తారు. కాగా జూలై1న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలనుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీటి రాక వేగం పుంజుకోనుంది.

స్వల్పంగా వరద

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు స్వల్పంగా వచ్చి చేరుతోంది. డ్యామ్‌లోకి 2,558 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల గోదావరి ద్వారా ప్రాజెక్టులోకి వరద వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 15.567 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 9.905 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 617 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 4.328 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 1.549 టీఎంసీల నీటిని వదిలారు.



బాబ్లీ నుంచి శ్రీరాంసాగర్‌కు నీరు

-టి.శ్రీనివాసరావు గుప్త, ఎస్ఈ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, పోచంపాడ్



బాబ్లీ ప్రాజెక్టు నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నీరు తీసుకొని రావడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతీ యేటా జూలై 1న బాబ్లీ గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలడం ప్రారంభం అవుతుంది. అక్టోబరు 28వ తేదీ వరకు బాబ్లీ గేట్లు తెరిచి వచ్చిన నీరు వచ్చినట్లుగానే దిగువకు వదులుతుంటారు. దీంతో శ్రీరాంసాగర్‌లోకి వరద నీరు రావడం ఎక్కువ కానుంది. రాష్ట్రంలోని కందకుర్తి వద్ద గోదావరిలోకి నీరు ఉధృతి పెరగనున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. చేపలు పట్టేవారు, రైతులు, ఇతర వ్యక్తులు గోదావరి పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లవద్దు.

వరద కాలువ పనులు ప్రారంభమై నేటికి 32 ఏళ్లు



నాడు ఏర్పాటు చేసిన శిలాఫలకం

జగిత్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టునుంచి వరద ప్రవాహ కాలువ నిర్మాణంకోసం పనులు ప్రారంభమై సోమవారానికి సరిగ్గా 32సంవత్సరాలు పూర్తయ్యాయి. నిజామాబాద్‌జిల్లా బాల్కొండ మండలం బస్సాపూర్‌వద్ద 1993 సంవత్సరం జూన్ 30వ తేదీన అప్పటి భారత ప్రధాని పీవీ నరసింహారావు వరద కాలువ పనులు ప్రారంభిస్తూ పునాదిరాయి వేసిన శిలాఫలకం ఇప్పటికీఉంది. ప్రస్తుతం వరద కాలువద్వారా పలు జిల్లాలకు చెందిన రైతులకు శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు అధికారులు సాగునీరు అందిస్తున్నారు. పనులు ప్రారంభమైన ఆనాటి రోజును రైతులు నెమరు వేసుకుంటున్నారు.

లారీ డ్రైవర్లు సమ్మెలో పాల్గొనాలి

భగత్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జులై 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రికసమ్మెలో లారీడ్రైవర్లు పాల్గొనాలని సీఐటీయూ జిల్లాఅధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని లారీ అసోసియేషన్ వద్ద కరీంనగర్ లారీ డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా కరపత్రాన్ని అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రవాణారంగాన్ని పూర్తిగా కార్పొరేట్‌సంస్థలకు అప్పచెప్పేందుకు మోటార్‌వెహికిల్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. నాలుగు లేబర్‌కోడ్స్ రద్దయ్యేవరకు కార్మికులంతా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఆరిఫ్, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నో అవహేళనలకు గురయ్యాను..

● అందరి సహకారంతో ఈ స్థితికి చేరుకున్నాను.. ● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

తిమ్మాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నో అవహేళనలకు గురయ్యాను.. అందరి సహకారంతో నేడు ఈ స్థితికి చేరుకున్నానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో మాదిగ ఆఫీషియల్ కాంగ్రెస్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం నేను తాను సామాన్య వ్యక్తినని, ఇప్పుడు రాష్ట్రమంత్రినయ్యానని, దీనికంతటికీ కారణం తన సామాజికవర్గం అయిన మాదిగ కుటుంబసభ్యుల ఆశీర్వదమన్నారు. ఎన్నికష్టాలువచ్చినా.. ఓడినా.. గెలిచినా.. నీతి, నిజాయితీగా పనిచేస్తానని తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేసి 30ఏళ్ల పోరాటానికి ముగింపు పలికారు. ఈ ఉద్యమాన్ని నడిపిన మందకృష్ణ మాదిగకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే దళితులకు మేలు జరిగిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మాదిగల డిమాండ్ మేరకే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రి వర్గ విస్తరణలో ప్రాతినిధ్యం లభించిందని అన్నారు. మాదిగజాతి పక్షాన నిలిచిన రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో హైదారాబాద్‌లో 10లక్షలమంది మాదిగలతో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ప్రొఫెసర్ చింతకింది కాసీం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు కాళేశ్వరం నిర్మాణానికి మళ్లించిందని విమర్శించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోనే సుమారు 1800ఎకరాల ఎస్సీల భూముల, ఇతర నియోజకవర్గలలో కూడా దళితుల భూములను లాక్కొని ప్రభుత్వ కార్యలయాలు, ఇతర భవనాలకు కేటాయించి నిర్మించారని ఆరోపించారు. దళితులలో 90శాతం మంది చదువుకు దూరంగా ఉన్నారని, వారిని చదివించి చైతన్య వంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో జానపద కళాకారుడు ఏపూరి సోమన్న తనపాటలతో, కళాకారుల నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హోమియో వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

సుభాష్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హోమియో వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రకృతి బంకెట్‌హాల్‌లో ఆర్గనైజింగ్‌కమిటీ మెంబర్లు డాక్టర్ దీపక్‌బాబు, డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ హోమియోపతి 5వరాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడారు. ఇతర వైద్యరంగంలో ఒక్కో జబ్బుకు ప్రత్యేక వైద్యుడు ఉంటారని, హోమియోపతిలో మాత్రం ఒక్కరే అన్నిరకాల జబ్బులకు చికిత్స అందించడం గొప్ప విషమయని అన్నారు. ఈ సందర్భంగా తనస్వీయ అనుభావాన్ని వివరించారు. మానేరు రివర్‌ఫ్రంట్ స్టడీ టూర్ కోసం తెలంగాణ ప్రభుత్వం ఒక బృందాన్ని సియోల్ పంపించిందని, అందులో తాను ఒక సభ్యుడినని తెలిపారు. అక్కడికి వెళ్లగానే తనకు విపరీతమైన దగ్గు వచ్చినట్లు, దీంతో నాలుగు రోజులపాటు చాలా ఇబ్బంది పడినట్లు చెప్పారు. అక్కడి వైద్యులకు చూపించడంతోపాటు కరీంనగర్, హైదరాబాద్‌లలోని కార్పొరేట్ ఆస్పత్రులకు తిరిగానని, కొందరు ఆపరేషన్ అవసరమన్నారని అన్నారు. తనతో ఉన్న మరో మంత్రి హైదరాబాద్‌లో హోమియో వైద్యుడు డాక్టర్ జనార్దన్‌రెడ్డిని కలవాలని సూచించడంతో వెళ్లానని, జనార్దన్‌రెడ్డి చికిత్స అందిస్తున్నారని ప్రస్తుతం దగ్గు తగ్గుముఖం పడుతోందని తెలిపారు. హోమియో మందులు వాడడంతో ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండకపోవడం గొప్ప విషయమన్నారు. హోమియో వైద్యుల సంఘం భవన నిర్మాణం కోసం స్థలం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పేదలు వైద్యులను దేవుళ్లతో కొలుస్తారని, వారినమ్మకాన్ని వమ్ము చేయకుండా వైద్యం అందించాలని కోరారు. ఈ సదస్సులో కరీంనగర్‌కు చెందిన ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ కొడిత్యాల శ్రీనివాస్ లైవ్‌లో ఫీహెల్ ఇన్ఫెర్టిలిటీపై, డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాథాలాజికల్ ప్రిస్క్రిప్షన్‌పై, డాక్టర్‌గణేశ్ ఆచారి కార్డియోమైపతి, డాక్టర్ హీరాలాల్ అగర్వాల్ రేనల్‌వ్యాధులపై సైంటిఫిక్ సెమినార్‌ను నిర్వహించారు.

● రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

సదస్సులో 2025-27సంవత్సరం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ హరికృష్ణ ఎన్నికయ్యారు. గుజరాత్‌కు చెందిన డాక్టర్ నిషికత్ తాపే ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కొడిత్యాలశ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సదస్సులో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తి, ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంఏ రావు, జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ మహేశ్ పగడాల, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంఎన్ రాజు, కార్యదర్శి డాక్టర్ గోరంట్ల చంద్రశేఖర్‌రావు, కరీంనగర్ బాధ్యులు డాక్టర్ ఎంఎస్ రెడ్డి, డాక్టర్ మానస, డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ అరుణ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ వినయకుమారి, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ రవీంద్రాచారి, డాక్టర్ దయాకర్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ దికనకర్‌రెడ్డి, డాక్టర్ కేశవరెడ్డి, డాక్టర్ హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

మల్లన్న ఆలయంలో భక్తుల పూజలు

ఓదెల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం అధికసంఖ్యలో భక్తులుతరలివచ్చి పూజలు నిర్వహించారు ఇతర జిల్లాల నుంచి భక్తులు జాతరకు వచ్చి ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. మల్లికార్జునస్వామికి కోడె మొక్కులను బోనాలను సమర్పించిన అనంతరం బంగారు పోచమ్మ మదన పోచమ్మకు మొక్కులను సమర్పించారు.



మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చల్ల హరిశంకర్



చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చల్ల హరిశంకర్ నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించిన సంఘం రాష్ట్ర ఎన్నికల్లో ఆయనను ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని సంఘ గౌరవాధ్యక్షుడు వద్దిరాజే రవిచంద్ర చేతుల మీదుగా హరిశంకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ బలోపేతంతోపాటు కుల బాంధవుల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ముకాస కులస్తులు ముందుకు రావాలని అన్నారు. నియామకానికి సహకరించిన అదరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే వినియోగించాలి



రైతుల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే వినియోగించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. తిప్పాపురంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాలలో ఆదివారం కోడెల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంపిణీ చేసిన కోడెలను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించి అర్హులైన వారికి గోశాలలోని 137జతల కోడెలను అందజేశామన్నారు. గోశాల సిబ్బంది కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆలయఇంచార్జి ఈవో రాధాబాయి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, గోశాల కమిటీసభ్యులు రాధాకృష్ణరెడ్డి, పశు వైద్యాధికారులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



- నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దు
- ఆరోగ్యంపై దృష్టిసారించాలి

భగత్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వచ్చేసింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతా వరణం చల్లబడింది. దీంతో వేసవిలో భగభగ మండిన ఎండల నుంచి ఉపశమనం లభించింది. కాలానికి అను గుణంగా ఆరోగ్యం, ఆహారం, పరిసరాలపై దృష్టి సారించాలి. ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోయినా జీవన శైలిపై ప్రభావం చూపుతాయి. వర్షాకాలంలోనూ ప్రతి ఒక్కరూ కొన్ని జాగ్రతలు తీసుకోవాలి.

● ఆహారం విషయంలో.

రోడ్డుపై కనిపించే వేడివేడి మిర్చిలు, పకోడీల జోలికి వెళ్లవద్దు. వారు వాడే నూనే, పిండి, కూరగాయల విషయంలో ఏ మాత్రం కల్తీ జరిగినా, లేదా ఇతర కారణాల చేత పాడైనా అవి కాలేయంపై ప్రభావం చూపుతాయి. దీంతో డయేరియా, కామెర్లు, కలరా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రధానంగా ఆహారంపై ఈగలు దోమలు వాలకుండా జాగ్రతలు తీసుకోవాలి. ఈగలు, దోమల మందు తరుచూ చల్లుతుండాలి. అన్నిరకాల పండ్లు, కూరగాయాలు నీటిలో శుభ్రంగా కడిగిన తర్వాత వాడుకోవాలి. సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా వేడి చేసి ఫిల్టర్ చేసిన శుద్ధమైన నీటినే వాడాలి.

● బయటకు వెళ్లేముందు

బయటకు వెళ్లేముందు గొడుగు తప్పకుండా తీసుకెళ్లాలి. ద్విచక్రవాహనదారులు రెయిన్ కోటుతోపాటు హెల్మెట్ ధరించాలి. సెల్ ఫోన్‌లు, పెన్ డ్రైవ్‌లు ఒక ప్లాస్టిక్ కవర్లో వేసుకోవాలి. వర్షాకాలంలో వాటర్ ప్రూఫ్ చెప్పులు, షూ వాడితే మంచిది.

● విద్యుత్‌తో అప్రమత్తత

వర్షాకాలంలో విద్యుత్ పోయిన వెంటనే టీవీ, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్ ఇతరాత్ర ఎలక్ట్రానిక్ పరికరాలను ఆఫ్ చేయాలి. కాపర్ వైర్‌తో ఎర్తింగ్ చేయించుకోవాలి. పిడుగు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాపర్ యాంటినా ఏర్పాటు చేసుకోవాలి. కాపర్ యాంటినా ద్వారా పిడుగు భూమిలోకి వెళ్తుంది.

● ఆరోగ్యం విషయంలో..

జలుబు, దగ్గు ఉంటే వర్షంలో తడవడం, బయటకు వెళ్లడం చేయకండి. ఆస్తమా,



డయాబెటిక్ ఉన్నవారు మరింత జాగ్రతలు తీసుకోవాలి. లేదంటే వారికి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. హెర్బల్ ఛాయ్, యాంటి బ్యాక్టీరియా ఉన్న చాయ్‌ను ఎక్కువగా తాగాలి. అల్లం చాయ్ తాగితే మరీ మంచిది.

● దుస్తులు

షార్ట్ లెంత్ దుస్తులు వాడాలి. మరి వదులుగా ఉండేవి వర్షాకాలంలో వేయకూడదు. ఎయిర్ కండిషన్ గదుల్లో తడిగా ఉన్న బట్టలు వేసుకొని వెళ్లరాదు, ఫంగస్ వంటి ఇన్ఫెక్షన్లు వస్తాయి.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఓదెల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో ఓదెల మండలం కనగర్తి దాసరి పద్మా, హన్మయ్య జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని ఎంఈఓ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో విలేకరులతో మాట్లాడుతూ కనగర్తికి చెందిన ముద్దమల్ల అజయ్ అండర్-14 బాలురవిభాగంలో ట్రయా తలాన్‌లో గోల్డ్‌మెడల్ సాధించాడన్నారు. బాలికల విభాగంలో అనవేన అర్చన ట్రయా తలాన్ లో గోల్డ్ మెడల్, అండర్ - 12 బాలికల విభాగంలో దామ జయశ్రీ 60 మీటర్ల కిడ్స్ జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్, నైతం శశాంత్ సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. హన్మకొండ వేదికగా నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఇక్కడి విద్యార్థులు ఎన్నికైనట్టు ఎంఈవో తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు అధ్యాపక బృందం అభినందించారు.



రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన కనగర్తి పాఠశాల విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక వీకేబీ ఫంక్షన్ హాల్‌లో 2003-04 బ్యాచ్‌కు చెందిన సిద్దార్థ ఉన్నత పాఠశాల ఎస్సెస్సీ విద్యార్థుల ఆత్మీయ అపూర్వ కలయిక అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, బోధించిన ఉపాధ్యాయులు ఒకే వేదికపై కలుసుకుని గత అనుభవాలను నెమరు వేసుకున్నారు. అనంతరం వారు విద్యను బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు.

ఇరవై ఏళ్ల తర్వాత తిరిగి తామంతా తమ గురువులతో కలివడం సంతోష కరంగా ఉందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు రవీందర్‌రావు, ఇన్‌చార్జి శ్రీధర్‌రావు, ఉపాధ్యాయులు జగన్‌రావు, సతీష్, శ్రీనివాసచారి, సతీష్, అశోక్, గంగాధర్, ప్రభాకర్, అనిల్ తదితరులు ఉన్నారు.

ప్రధాని మన్‌కీబాత్‌లో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

కథలాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజల మనసులోని మాట తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని పలువురు బీజేపీ నాయకులు వీక్షించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన రైతులు, మహిళలతో సంభాషించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు మల్యాల మారుతి, రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, మంగళి మహేశ్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం

● నర్సరీల్లో పంపిణీకి సిద్ధంగా మొక్కలు ● వర్షాలు పడగానే నాటేందుకు ప్రణాళిక

వెల్గటూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అడవుల శాతం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో నాటడానికి మొక్కలు సిద్ధం చేస్తున్నారు. మండలం లోని వివిధ నర్సరీలో పెంచుతున్న మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు కురవగానే మొక్కలు నాటించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రతీ గ్రామ పంచాయితీలో మొక్కల పెంపకానికి ఉపాధిహామీ పథకం ద్వారా పంచాయితీలకు నిధులు కేటాయించి, నర్సరీల నిర్వహణను పంచాయితీలకు అప్పగించారు. ఉమ్మడి వెల్గటూర్ మండలం లోని 30 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. మండల వ్యాప్తంగా రోడ్ల వెంట, ఇళ్లఆవరణల్లో 2,95,500 మొక్కలను నాటాలని లక్ష్యాన్నినిర్దేశించారు. లక్ష్యం కంటే అదనంగానే మొక్కలు పెంచుతున్నారు. మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వకం పనులు చేపట్టారు. వర్షాలు కురవగానే ఆయా గ్రామాల లోని ఖాళీ స్థలాలు, పాఠశాలలు, వైకుంఠధామాలతో పాటు రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు.


వెల్గటూర్ నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

● 30 నర్సరీల్లో మొక్కలు సిద్ధం

మండలంలోని 30 నర్సరీలలో పెంచిన మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు కురిస్తే అన్ని గ్రామాల్లో ఇంటిం టికీ ఆరు మొక్కలు పంపిణీ చేయనున్నారు. రైతులు పొలం గట్లపై మొక్కలు నాటుకునేవారు ఈజీఎస్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నర్సరీల్లో పూలు, పండ్లనిచ్చే మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు, కలప, ఈత, కర్జూర వంటి మొక్కలను మొక్కలను పెంచుతున్నారు. మారేడు, అంజీర్, కుంకుడు, నారెప, నెమలినారా, సుబాబుల్, యూకలిప్టస్, సీమ చింత, తులసి, గోరింట, మెడిసినల్ ప్లాంట్స్ దానిమ్మ, నిమ్మ, వెలగ, చింత, బహూనియా, గుల్మోహర్, దుర్సినం, బొగానివిల్ల, ఓర్నమెంటల్ ఫ్లవరింగ్ ప్లాంట్స్ పపాయ, ఉసిరి, నేరేడు, పెల్టోఫారం, టెకమా, వేప, మందార, సీతాఫలం, ఈత, మల్లె, నిద్ర గన్నేరు, అడవి తంగేడు, కానుగ, గులాబీ, గన్నేరు, జామ వంటి మొక్కలు పెంచుతున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీల నిర్వహణ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టారు. అన్ని గ్రామాల్లో నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నప్పటికీ వర్షాలు పూర్తి స్థాయిలో కురవక పోవడంతో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఇంకా చేపట్టలేదు.

● లక్ష్యం నెరవేరేనా..?

గతంలో హరితహారం కార్యక్రమంలో ఆర్భాటంగా మొక్కలు నాటినప్పటికీ నాటిన మొక్కలకు కొన్ని చోట్ల సంరక్షణ లేక ఎండిపోయాయి. ఈసారైనా అనుకున్న లక్ష్యం మేరకు మొక్కలు నాటి, సంరక్షణ చేపడతారా అని ప్రజలు సందేహం నెలకొంది. ప్రతి ఏటా లక్ష్యం మేర మొక్కలు నాటుతున్నప్పటికీ నాటిన మొక్కల్లో సగం మేర మాత్రమే మొక్కలు సంరక్షణకు నోచుకుంటున్నాయి. మిగతా మొక్కలు నీటిసౌకర్యం లేక ఎండిపోతున్నాయి. ఈసారైనా లక్ష్యం మేరకు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణానికి మేలు
-ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు



మొక్కల పెంపకంతో పర్యావరణానికి మేలు జరుగుతుంది. మండలంలోని నర్సరీల్లో మూడు లక్షల వరకు మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మొక్కల నాటితే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. నాటిన మొక్కలను సంరక్షిస్తూనే వర్షాలు కురవగానే వంద శాతం మొక్కలు నాటేలా చర్యలు చేపడతాం.

నాటడానికి సిద్ధంగా మొక్కలు
-ఏపీవో అనిల్



వన మహోత్సవంలో భాగంగా నాటడానికి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో గ్రామ జనాభా ప్రతిపాద కన నర్సరీలను ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను పెంచుతున్నాం. ప్రధానంగా నీడ, పండ్లు, పూలనిచ్చే మొక్కలతో పాటు ఈత, ఖర్జూర వంటి మొక్కలను పెంచుతున్నాం.

జన గణనకు సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

జన గణన ప్రక్రియ ముగియనుంది. జనగణన చేపట్టే ఉపాధ్యాయులకు 2025లోనే శిక్షణ ఇవ్వనున్నారు.

● అభివృద్ధికి దోహదం..

పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా శివారు ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మున్సిపాలిటీల శివారు ప్రాంతాలను గుర్తించి వాటిని విస్తరించేందుకు అనువైన పరిస్థితులను గుర్తించే ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. వీటి అభివృద్ధికి జనాభా లెక్కలు దోహదపడనున్నాయి. భవిష్యత్తులో విస్తరణకు అవకాశం ఉండేలా మున్సిపాలిటీలకు సమీపంలో ఉన్న ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించనున్నారు. మున్సిపాలిటీలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో అనువైన ప్రాంతాలు, రైల్వే కాలనీలు, విశ్వ విద్యాలయాలు, సైనిక శిబిరాలు వాటిని ప్రత్యేకంగా గుర్తిస్తారు. ఈమేరకు త్వరలోనే తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా వివరాలు సేకరించనున్నారు.

త్వరలో స్వదేశానికి ఇజ్రాయిల్ మృతుడు రవీందర్ మృతదేహం

-కడసారి చూపు కోసం ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులు

జగిత్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్‌లో ఈనెల 16న అనారోగ్యంతో మృతి చెందిన జగిత్యాల పట్టణానికి చెందిన రేవెల్ల రవీందర్ (57) మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించే ప్రక్రియ వేగవంతం అవుతోంది. రవీందర్ మృతిచెందిన సమయంలో ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తరలించే ప్రక్రియలో అవరోధాలు ఏర్పడ్డాయి. మృతదేహాన్ని స్వదేశానికి తరలించే పనిలో తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర విదేశాంగ శాఖ సహాయంతో వేగంగా చర్యలు తీసుకుంటున్నాయి. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి గొడిసెల రాజేశం గౌడ్, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్, తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇజ్రాయిల్‌లోని ఇండియన్ ఎంబసీతో సంప్రదింపులు జరపడం, ఇజ్రాయిల్‌లోని తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు సోమ రవి సమన్వయంతో మృతదేహం తరలింపు ప్రక్రియ వేగవంతం అవుతోందని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

రవీందర్‌కు బీమా పాలసీ లేకపోవడం వల్ల మృతదేహ రవాణా ఖర్చులను భారత రాయబార కార్యాలయం భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు. మొదట ఆపరేషన్ సింధులో భాగంగా రవీందర్ మృతదేహాన్ని విమాన మార్గంలో తరలించేందుకు ప్రయత్నించారు. అయితే కొన్ని ఆంక్షలు ఎదురవ్వడంతో అది వీలు కాలేదు. యుద్ధ పరిస్థితుల వలన ఆలస్యం జరిగినప్పటికీ, ఇప్పుడు కాల్పుల విరమణ నేపథ్యంలో రవీందర్ మృతదేహం తరలింపుకు మార్గం సుగమం సులువైంది. ప్రస్తుత పరిస్థితుల్లో రవీందర్ మృతదేహం కలిగిన శవపేటికను రోడ్డు మార్గంలో ఇజ్రాయిల్ నుంచి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌కు తరలించి, అక్కడి నుండి విమాన మార్గంలో ఢిల్లీ, అనంతరం హైదరాబాద్‌కు పంపేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. రవీందర్‌ను కడసారి చేసేందుకు జగిత్యాలలో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం


ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కోరుట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం మొహ్రరం వేడుకలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వివిధ వార్డులలో పీరీలను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. యువకులు పెద్దపులి వేశాలను వేశారు.

●మల్యాల: మొహ్రరం సందర్భంగా గ్రామాల్లో పెద్దపులి వేషాల సందడి నెలకొంది. గ్రామాల్లో పీరీలను ప్రతిష్ఠించడంతో మల్యాల, ముత్యంపేటలో ఆదివారం యువకులు పదుల సంఖ్యలో పులివేషాలను ధరించి ఆటలతో ఆకట్టుకుంటున్నారు.

ప్రకృతి వనాలపై పట్టింపేది..?

● పర్యవేక్షణ లేక రూపు కోల్పోతున్న ప్రకృతివనాలు ● కోతులకు నిలయంగా మారుతున్న వైనం



మల్యాలలో నిరుపయోగంగా ఊయల, మరమ్మతుకు నోచుకోని క్రీడా పరికరాలు

మల్యాల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలపై పట్టింపు కరువైంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో అవి రూపు కోల్పోతున్నాయి. ఏపుగా పెరుగుతున్న చెట్లు కోతులకు ఆవాసంగా మారుతున్నాయి. మల్యాల మండలంలోని 19 గ్రామాల పరిధిలో దాదాపు 21 ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అయితే కొన్నాళ్లుగా వాటిని పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండిపోవడం, కొన్ని చోట్ల ఏపుగా పెరిగి అందులోకి వెళ్లలేని స్థితికి మారాయి. మరి కొన్ని చోట్ల మందుబాబులకు అడ్డా అయ్యాయి. నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మల్యాల మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తా వద్ద గల ప్రకృతి వనంలో ఆట వస్తువులు చోరీకి గురి కాగ అవి నిరూపయోగంగా మారాయి. అలాగే చెట్లు దట్టంగా పెరిగి మందుబాబులకు సౌకర్యంగా మారిందని స్థానికులు అంటున్నారు. సర్వాపూర్‌లో గల ప్రకృతివనంలో చెట్లు ఏపుగా పెరిగి నిత్యం కోతులు నివాసముండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దాదాపుగా అన్ని గ్రామాల్లో ప్రకృతి వనాలపై పర్యవేక్షన లేదని అధికారులు పట్టించుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● వినియోగంలోకి తీసుకువస్తాం
-ప్రవీణ్, ఎంపీవో, మల్యాల

ప్రకృతి వనాలను తిరిగి వినియోగంలోకి తీసుకు రావడానికి తగు చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామాలలో వాటిని పరిశీలించి సంరక్షణ చేపడుతూ పర్యవేక్షణ చేయ డానికి గ్రామస్థాయి అధికా రులు, సిబ్బందికి తగు సూచనలు జారీ చేస్తాం. జిల్లా అధికారులు కూడా గ్రామాల్లోని ప్రకృతివనాలను పర్యవేక్షించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిక

కొడిమ్యాల, జూన్29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనాపూర్ గ్రామ మాజీ ఉప సర్పంచు ఏనుగుల తిరుపతి బీఆర్ఎస్ పార్టీ నుండి శనివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కురుమ సంఘం అధ్యక్షుడు జడ ఎల్లయ్య, మాజీ అధ్యక్షుడు జడ ఓదేలు, కర్నే రమేష్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే సత్యం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దూమాల నర్సయ్య, పలువురు నాయకులు ఉన్నారు.

నియామకం

మల్యాల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి యూఏఈ శాఖ ప్రధాన కార్యదర్శిగా దుబాయిలో ఉంటున్న సామాజిక సేవకుడు, మల్యాల మండలం పోతారంకు చెందిన ఆరే శేఖర్‌గౌడ్ నియమితులయ్యాడు. ఈ మేరకు జాగృతి అధినేత్రి, ఎమ్మెల్సీ కవిత ఆదివారం పలు దేశాల జాగృతి కమిటీలను నియమిస్తూ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

తీరనున్న విద్యార్థుల కష్టాలు

● తాండ్ర్యాలలో తరగతి గదుల నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు

●కొనసాగుతున్న పనులు


తాండ్ర్యాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గది

కథలాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తాండ్ర్యాల పాఠశాలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.35లక్షలు మంజూరు చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో 140 మంది, ఉన్నత పాఠశాలలో 127 మంది విద్యార్థుల చదువుతున్నారు. హైస్కూల్‌కు ఐదు తరగతులకుగాను కేవలం మూడు తరగతి గదుల్లోనే క్లాసులు నిర్వహించాల్సి వస్తోంది. గదులు సరిపోక గ్రామస్థులంతా కలిసి విరాళాలు పోగు చేసుకుని తాత్కాలికంగా షెడ్‌ను ఏర్పాటు చేసి తరగతి గదిగా వాడుకుంటున్నారు. మరుగుదొడ్లు శిథిలమై కంపు కొడుతున్నాయి. తాండ్ర్యాల పాఠశాల పరిస్థితిని విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు వివరించారు. కలెక్టర్‌కు ఫోన్ చేసి అక్కడికక్కడే హైస్కూల్ భవనంకు రూ.15 లక్షలు మంజూరు చేయించారు. ప్రాథమిక పాఠశాలకు 12 లక్షలు కేటాయించగా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణాలకు కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి రూ.8 లక్షలు మంజూరు చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణం వల్ల విద్యార్థుల అవస్థలు తీరి సక్రమంగా చదువుకునేందుకు అవకాశం చిక్కనుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

● ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు
-ఉరుమల్ల చారి, కాంగ్రెస్ నాయకుడు

ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన పాఠశాల గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల కోసం గది నిర్మాణం జరుగుతోంది. హైస్కూల్ గది టెండర్ పూర్తయితే పనులు మొదలుకానున్నాయి.

'నైతిక విలువలతో కూడిన విద్య అవసరం'

బీర్‌పూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతో కూడిన విద్య అవసమరని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్ అన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో తపస్ అనుబంధ సంస్థ అఖిల్ భారతీయ శైక్షిక్ మహా సంఘ్ నిర్వహిస్తున్న హమారా విద్యాలయ హమారా తీర్థ్ కార్యశాల అనే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి తపస్ ప్రతినిధిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు వొడ్నాల రాజశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్

రెండు పశు వైద్యశాలలు.. ఒక్కడే వైద్యుడు

● పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు ● సిబ్బంది కొరతతో పశు పోషకాల ఇక్కట్లు

మల్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలో రెండు పశు వైద్యశాలలు ఉండగా ప్రస్తుతం ఒక్కడే వైద్యుడు సేవలు అందిస్తున్నాడు. దీంతో పశువుల వైద్యానికి ఇబ్బందిగా మారుతోంది. మండలంలో మల్యాల, రామన్నపేటలో పశు వైద్యశాలలు, ఓబులాపూర్‌లో పశు వైద్య సబ్‌సెంటర్ ఉన్నాయి. మల్యాలలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ రాజ్‌కుమార్ ఒక్కరే ఉన్నారు. ఇక్కడ లైవ్ స్టాక్ అసిస్టెంట్, అటెండర్ లేకపోవడంతో పశువులు రోగాల బారిన పడితే ఇక్కట్లు ఎదురౌతున్నాయి. రామన్నపేటలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ మాత్రమే పనిచేస్తున్నాడు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పశువులు రోగాల బారిన పడితే సిబ్బంది కొరత ఇబ్బందిగా మారే అవకాశం ఉంటుందని పశు పోషకులు అంటున్నారు.


మల్యాలలోని పశు వైద్యశాల

● మండలంలో పశువుల లెక్క ఇదీ..

మల్యాల మండలంలో 3,907 గేదెలు, 1,368 ఆవులు, 20,567 గొర్రెలు, 4,256 మేకలు, 50వేలకు పైగా కోళ్ల, 250 వరకు పందులు, 200పైగా పెంపుడు కుక్కలు ఉన్నాయి. అయితే సిబ్బంది కొరతతో పశువుల వైద్యానికి ఇబ్బందులు కలుగుతున్నాయని పశువుల యజమానులు పేర్కొంటున్నారు.

సిబ్బంది కొరతపై అధికారుల దృష్టికి తీసుకెళ్లా
-రాజ్‌కుమార్
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, మల్యాల

సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఇబ్బం దులు లేకుండా పశువు లకు వైద్యం అంది స్తున్నాం. సిబ్బంది నియామకంపై ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మందుల కొరత లేకుండా ఎప్పటి కప్పుడు తెప్పించి అందజేస్తున్నాం. వానాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల వారీగా శిబిరాలు నిర్వహిస్తున్నాం.

జాతీయ కెమెరా దినోత్సవం

ధర్మపురి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామీ ఆలయంలో మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ కెమెరా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఛాయా చిత్రకారుల సంక్షేమార్థం, లోక కళ్యాణం కోసం ఆలయ అర్చకులు గుండి అశ్విన్‌శర్మ వేద మంత్రోచ్చరణల మధ్య కెమెరాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఛాయా చిత్ర దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఛాయా చిత్ర యంత్ర దేవతా చిత్రపటం ముందు కెమెరాలు ఉంచి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ధర్మపురి పట్టణానికి చెందిన సీనియర్ ఫోటో గ్రాఫర్ వడ్లూరి రవీందర్ స్వయంగా మట్టితో ఛాయా చిత్ర యంత్ర దేవతా విగ్రహాన్ని తయారు చేసుకున్నారు. అటు పిదప కెమెరా పరిభాషలో కెమెరాకు మృత్తికా ఛాయా చిత్రర యంత్ర దేవికి ప్రత్యేక అర్చనలు, దూప దీప నివేదన మంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఆషాడ మాసంలో ప్రజలు చల్లగా ఉండాలని పొలిమేర దేవతలను బోనాలతో పూజిస్తారు. ధర్మపురి ఫోటో గ్రాఫర్లు ప్రపంచ ఫోటో గ్రాఫర్ల సంక్షేమం కోసం గత ఐదు సంవత్సరాలుగా ఛాయా చిత్ర యంత్ర దేవత పూజలను నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సమ్మేళనానికి తరలిన బీజేపీ శ్రేణులు


జగిత్యాల నుంచి సమ్మేళనానికి తరలివెళ్తున్న బీజేపీ శ్రేణులు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పసుపు రైతుల కల సాకారం అవుతున్న తరుణంలో ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నిజామాబాద్‌కు వస్తున్న సందర్భంగా నిర్వహించే కిసాన్ సమ్మేళనంకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో బీజేపీ శ్రేణులు, రైతులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నలువాల తిరుపతి మాట్లాడుతూ ఇందూరు జిల్లాకు పసుపు బోర్డును ప్రకటించి, కేంద్రీయ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సందర్భం మర్చిపోలేనిదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, అర్బన్ మండల అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు ఇట్నేని రమేష్, రాయికల్ పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల అధ్యక్షులు రెంటం జగదీష్, ఆడెపు నర్సయ్య తో పాటు నాయకులు, కార్యకర్తలు రైతులున్నారు.

●పసుపు బోర్డు జాతీయ కార్యాలయం ప్రారంభోత్సవంకు విచ్చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను ఎంపీ అర్వింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి స్వాగతం పలికారు.

●**కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని పలు వార్డులకు చెందిన బీజేపీ శ్రేణులు ఆదివారం నిజామాబాదు జిల్లా కేంద్రంకు బయలు దేరి వెల్లారు.

●రాయికల్: నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ప్రారంభ కార్యక్రమానికి రాయికల్ నుంచి ఆదివారం బీజేపీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో రాయికల్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులు కునారపు భూమేష్, బన్న సంజీవ్, సుంటిగీకర్ రాము, మచ్చ నారాయణ, బొడుగం శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

●బీర్‌పూర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనను విజయవంతం చేయడానికి ఆదివారం బీర్‌పూర్ మండల బీజేపీ శ్రేణులు భారీగా తరలి వెల్లారు. బీర్‌పూర్ మండల అధ్యక్షులు ఆడెపు నర్సయ్య ఆధ్వర్యంలో జెగిశెట్టి శ్రీనివాస్, గర్శకుర్తి రమేష్, తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ అందరివాడు
-అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరివాడని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జగిత్యాల పట్టణంలో ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఆమె ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం విలువ మన సమాజంలోని అందరికీ తెలియక పోవడం బాధాకరమని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఎవరికైనా అన్యాయం జరిగినపుడు న్యాయస్థానానికి వెళతారని అన్నారు. ఆ హక్కు రాజ్యాంగం కల్పించిందేనని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ బీఎస్ లత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆమెను అంబేద్కర్ సంఘం నాయకులు అభినందించారు.

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

కొడిమ్యాల, జూన్29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన చెలుమల్ల మహేందర్(45) గ్రామ పంచాయతీ పంప్ ఆపరేటర్, లైన్‌మెన్ కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా కో కన్వీనర్ కోమటి చంద్రశేఖర్ గ్రామ పంచాయతీ నుండి దహన సంస్కారాలకు 10వేల రూపాయలను అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాంకిషన్‌రావు, సీఐటీయు మండల నాయకుడు రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ మృతిచెందిన మహేందర్ కుటుంబ సభ్యులకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ఆదివారం 5వేల రూపాయలు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు 2వేల రూపా యలను ఆర్థిక సహాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మల్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు శివ ప్రసాద్, నరేష్ తదితరులు ఉన్నారు.